

## నా గురించి నేను

నాపదహారేళ్లప్పుడు ప్రజామత వారపత్రిక వచ్చీరాని భాషలో రాసిన కథ అచ్చువేసి నన్ను ఆశ్చర్యపరచింది. తర్వాత కొడవటిగంటి వారి సాహిత్యమూ, వారి ఆధ్వర్యంలో వెలువడిన చందమామా బాగా స్ఫూర్తి నిచ్చాయి.

దాదాపు అన్ని ప్రక్రియలూ అంతో యింతో రాయగలిగాను. ఎవరుఏం రాసినా జీవితమంత సస్పెన్స్ చిత్రణ వున్న సాహితీ ప్రక్రియను ఉత్పత్తి చేయలేరని నా నమ్మకం

'శవ పంచాయితీ' వంటి వాస్తవ సంఘటనే నా నమ్మకానికి అప్పుడప్పుడు మరింత బలం కలిగిస్తోంటాయి.

జీవిత వాస్తవాల్లో అతికొద్ది పాటి నిర్లక్ష్యాలు సైతం పెనుమార్పులకు కారణ భూతాలవుతాయి .ఆ నిర్లక్ష్యం డాక్టర్ వల్ల నైనా కావచ్చు యాక్టర్ వల్లనైనా కావచ్చు.

పత్రికా ముఖంగా మీతో మాట్లాడటానికి వీలుకలిగించిన 'ఉదయం' కి కృతజ్ఞతలు.మీకు శుభాకాంక్షలతో

—ఎమ్.వి.వి సత్యనారాయణ

డాక్టర్ అసహనంగా కదిలాడు.

ఉదయం నుండీ అంతా రద్దీగా ఉంది. వచ్చే రోగులూ, వెళ్ళే రోగులూ, మూడు జబ్బులూ ఆరు ఔషధాలుగా పరిస్థితి. ఇదే హడావుడిలో చావు కేసు ఒకటి తగిలింది.

ఆమెకు ముగ్గురు పిల్లలు. బీదకుటుంబం. భర్త ఏదో ప్రభుత్వోద్యోగం చేస్తాడట. ఏం లాభం? ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్టుంది అతగాడి పరిస్థితి. వచ్చిన జీతమంతా ప్రభుత్వసారాదుకాణంలో సమర్పించేసుకుని తుళ్ళుతూ తూలుతూ ఇంటికి వస్తాడట.

ఆమె ఏదో పురుగుల మందు తాగింది. ఆమెను మార్చ్యురీలో వేశారు. భర్తా, పిల్లలూ ఆస్పత్రి వాకిట్లో చేరి ఒకటే శోకాలు తీస్తున్నారు.

డాక్టర్‌కి మహా చెడ్డ చిరాకుగా ఉంది. ఆమెను మార్చ్యురీలోంచి తీసి వాళ్ళ భుజాన ఎత్తి పంపేద్దామా అన్నంత కోపం వస్తోంది.

కాని శవాన్ని కొయ్యకుండా ఇవ్వకూడదు. మరణ కారణం తెలియపరచాలి. ఈ రోజంతా ఆ శవంమీద వృధా చేసి చివరకి డెత్ సర్టిఫికెట్ తగలెయ్యాలి.

ఇంట్లో మంజు ఎదురు చూస్తోంటుంది.

మంజు! పిచ్చి మొద్దు! పల్లెటూరిదయితే ఏంగాక, పిప్పళ్ల బస్తాలాగా ఉంటే ఏంగాక, ఆరులక్షల కట్నం, పాతికెకరాల మాగాణీ, వలభై తులాల బంగారం వెంట తెచ్చుకుంది. అయిదో తరగతిలో ఆగిపోయి అంతతోనే శోభనం గదిలోకి అడుగు పెడితే ఏంగాక ఇంగ్లీషు పిక్చర్స్ విపరీతంగా చూస్తుంది.

ఈరోజు లీలామహల్‌లో కొత్త పిక్చర్!

సాయంకాలం ప్రోగ్రాం! ఇప్పుడే ఒంటి గంటయ్యింది. మిగతా డాక్టర్సంతా సెలవు. శవ పంచాయితీ నాలుగు కయినా పూర్తి చేసుకుంటే గాని సాయంకాలం మంజుతో కలిసి సినిమా చూడటం పడదు. కోరికతీరక పోతే మంజు మగాడయింది చూడదు! మొగుడయింది అసలు చూడదు! రాత్రికి శివరాత్రి జాగరణే!

"సార్! డాక్టర్ బాబుగారూ! మా ఆడదాన్ని బతికించండి సార్!"

డాక్టర్ చిరాకుగా చూశాడు., తెలుగు వాడికి అసలు కామన్ సెన్స్ అనేది పూర్తిగా పోతోందేమో!! తెలుగు సినిమాలు చూచి చూచి వాడిలో రీజనింగ్ పవర్ నాశనమై పోతోందేమో!


తన సమర్థతకి తనకే నవ్వుపుట్టు కొచ్చింది డాక్టర్‌కి. అదే నవ్వును కొంత గంభీరమైన నవ్వుగా మార్చుకుని రామచంద్రం వైపు చూశాడు.

ఉదయం నుండీ ఏడుస్తున్నాడేమో రామచంద్రం మొహం మలినమై పోయి ఉంది. బట్టలు మురికిగా ఉండి సారాయి కంపు కొడుతూన్నాయి. పిల్లలు ముగ్గురూ వాకిట్లో కూర్చుండి ఒకరి నొకరు కావలించుకుని ఏడుస్తున్నారు.

వాళ్ళను చూస్తుంటే ఒక్కక్షణం డాక్టర్‌లో మనిషి కదిలాడు. తిరిగి తెల్లకోటు వెనుక అణిగి పోయాడు. ముగ్గురూ నాలుగేళ్ళూ, అయిదేళ్ళు ఆరేళ్ళూ వయస్సుల వాళ్ళయి ఉంటారు.

అందరి కంటే పెద్దది ఆడపిల్ల, చిన్నకట్ డ్రాయర్, చాలీ చాలని జాకెట్ తప్ప ఆపిల్ల ఎముకల గూడును కప్పడానికి ఏమీ సాధనం లేదు.

"ఎలా బతికించమంటావ్? ప్రాణాలు తీసింది నేవా? లేక తీయమనా సర్కారోళ్ళు నాకు ఉద్యోగం ఇచ్చారు?" డాక్టర్‌కి అసహనంతో కూడిన సరదా ఒకటి రేకెత్తింది. ప్రస్తుతానికి ఆ సరదా తీర్చుకుంటున్నాడు.




రామచంద్రం నెత్తీ నోరూ మొత్తుకుని "మీరని ఎలా అంటాన్సార్? అది నాబాధ పడలేక పురుగుల మందు తాగేసింద్సార్! మందు కక్కించాలి సార్! క్షమించండి సార్! మీ కాంపౌండర్ వచ్చేసరికి అది స్పృహతప్పి పోయి ఉంది సార్! కాంపౌండర్ వాడి చూచి ప్రాణం పోయిందన్నాడు సార్! ప్రాణం పోయి ఉండవచ్చు సార్! కానీ మందుమ కక్కిస్తే ఏమైనా ఫలితం ఉంటుందేమో సార్!" అన్నాడు.

డాక్టర్ గంభీరమైననవ్వొకదాన్ని మరలవిసిరాడు.

'మార్చ్యురీలో వేసే మూడు గంటలయింది కదయ్యా! ఇప్పుడా చెబుతావు!" అన్నాడు నవ్వు తెరల వెనక.

రోగుల వరస కదులుతోంది. డాక్టర్ నవ్వుతూనే ఉన్నాడు. రోగులను పలకరిస్తోనే ఉన్నాడు. మందులు రాస్తూనే ఉన్నాడు. మధ్య మధ్య జోకులు పేల్చేస్తోనే ఉన్నాడు.

నర్స్ ఉదయం సెలవు పెట్టినట్టుంది. ఏదీ కాని వేళలో డ్యూటీకి వచ్చి తెల్ల బట్టలలో దూరి పోయింది.



# శవ పంచాయితి

ఎమ్.వి.వి. సత్యనారాయణ



ఆమె రాకతో డాక్టర్ మరీ రెచ్చి పోయి జోకులు కుప్పింపడం మొదలు పెట్టాడు.

రామచంద్రం కానీ, అతడి సంతానం కానీ ఆ జోకులను ఎంజాయ్ చేసే స్థితిలో లేరు, సరికదా వచ్చే పోయే రోగుల ఎంక్వయిరీని తట్టుకోలేక పోతున్నారు.

రామచంద్రం ఆస్పత్రి వెనక్కి పోయి కూర్చు న్నాడు. ఆసుపత్రి నుండి మార్చ్యూరీ భవనం విడిగా యాభై అరవై గజాల దూరంలో ఉంది. రోగులకు కనబడనంత దూరంగా పోయి కూర్చున్నాడు.

అతని మనసు కుళ్ళిపోతోంది.

సావిత్రి ఎంత మంచిది! 'ఉత్తమ ఇల్లాలు' భర్త ఎన్నికష్టాలు పెట్టినా సహనంతో తట్టుకుంది. ఇక తట్టు కోలేని స్థితిలో మాత్రమే పురుగుల మందు సంపాదించుకుంది. కింది తరగతి నిర్భాగ్యురాలు పురుగుల మందు వరకూ వెళ్ళిందంటే ఆ తప్పు పూర్తిగా మగాడిదే!

అవును. ఆమె చనిపోతే ఆనేరం తనదే. పూర్తిగా తనదే! ఎంత దారుణం! తనకు ముగ్గురు పిల్లలను కన్న ఒక ఆడది తన ప్రాణాలు తీసుకోవడానికి సిద్ధమై పోయిందంటే ఆ జీవికి బతుకు కంటే చావే హితమని తోచింది!

రామచంద్రం తల బాదుకున్నాడు.

తన వలన చాలాపొరపాటు జరిగిపోయింది.

'సా...వి....త్....రీ...!!' అతడి గొంతు మూగగా రోదించింది.

అదిగో... ఆ కనిపించే ఇంట్లోనే సావిత్రి ఉంది. డాక్టర్ మరికొంత శ్రద్ధ తీసుకుని ఉంటే సావిత్రి బ్రతికి ఉండేది. సావిత్రికి తానూ ద్రోహం చేశాడు. అటు ప్రక్క డాక్టర్ ద్రోహం చేశాడు.

ఒక ఆడదాని మీద ఇద్దరు మగ వాళ్ళద్రోహం.

ఒకడు అయిన వాడయితే రెండో వాడు కానివాడు.

రామచంద్రం లేచాడు. నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ ఇసుకలో నడిచాడు. కళ్ళు తెరచి చూసే టప్పటికి మార్చ్యూరీ ముందున్నాడు.

మార్చ్యూరీ ముందు ఎవరూ కాపలాలేరు. కనీసం ఒక్క పోలీస్ కానిస్టేబుల్ కూడాలేడు. పోలీసులే డాక్టర్‌ని పిలిపించారు. డాక్టర్ తాను రాకుండా కేవలం కాంపౌండర్‌ని పంపించాడు.

కాంపౌండర్ వాడి చూశాడు.

సావిత్రి చచ్చి పోయిందని సర్టిఫికెటు ఇచ్చేశాడు.

వ్యవస్థ ఎంత పుచ్చిపోయింది? అంతా తారుమారే! ఒకడు చేయవలసిన డ్యూటీ మరొకడు చేయడం! అంతేకాదు. సావిత్రి పురుగుల మందు సేవించింది అవగానే ముందు పోలీసులు దిగిపోయారు. పురుగుల మందు సావిత్రికి ఎలా అందుబాటులోకి వచ్చిందో పాతిక ముప్పైయి రకాల ప్రశ్నలు వేసి అందరినీ చావ గొట్టేసంత పనిచేశారు.

అవును! సావిత్రికి పురుగుల మందు ఎలావచ్చింది?

అది అందరికీ కొరకరాని ప్రశ్నే అయ్యింది. చివరికి పోలీసులు సావిత్రిని మార్చ్యూరికి చేర్చి తృప్తి పడిపోయారు.

"టక్...!"

రామచంద్రం ఆలోచనలు తెగిపోయాయి. టక్ మని ఎక్కడి నుండి వచ్చింది చప్పుడు? చుట్టూ చూశాడు రామచంద్రం.

మార్చ్యూరీకి ముందు కదిలే ప్రాణి తానొక్కడే. పిల్లలు కూడా ఆస్పత్రి ముందు వాకిట్లో ఉన్నారు తప్పితే ఇటు రాలేదు. అయితే చప్పుడు ఎక్కడి నుండి వచ్చింది?


అప్పుడు గమనించాడు రామచంద్రం.

మార్చ్యూరీ తలుపులు తీసి ఉన్నాయి. రెండు తలుపులకూ మధ్యా కాస్త ఎడం ఉంది. చప్పుడు లోపలి నుండి వచ్చిందా?

రామచంద్రం మెల్లెక్కి గుమ్మందగ్గరకు వెళ్ళాడు.

'టక్...!'

చప్పుడు లోపలి నుండే వచ్చింది. సందేహం లేదు. రామచంద్రం వణుకుతూ తలుపుల మధ్య ఎడం పెంచాడు.




పెద్ద హాలు. హాలులో ఒక ప్రక్క పొడుపు పాటి బల్ల. బల్లకు క్రింద భాగంలో నేలమీద శవం ఉంది. ఎవరో మగాడి శవం. ఒంటిన గుడ్డకూడా సరిగ్గా కప్పలేదు. శవం మీద ఎలుకలు పరుగెత్తుతున్నాయి. నోరు ప్రాంతంలో బొద్దింకలు ప్రాకుతున్నాయి.

రామచంద్రం వీపు ఝల్లుమంది.

మగాడిని చూచి కాదు. బల్లమీద ఆడది పడుకుని ఉంది. ఆమె ఎవరో కాదు సావిత్రే! అదే చీర! అదే రవిక!

ఆమె కళ్ళు గుమ్మంలోకి చూస్తున్నాయి.

ఆ కళ్ళలో వ్యక్తమైన జీవశక్తికి అతడి వీపు ఝల్లుమంది.

సావిత్రి కనురెప్పలు టప టప లాడాయి. పెదిమలు అల్లాడాయి. కనుగుడ్లు నీరసంగా కదిలాయి.

గదంతా దుర్భరమైన వాసన

రామచంద్రం కళ్ళు నులుముకుని మరీ చూశాడు. సావిత్రి చూస్తోందా? కలా? నిజమా? భ్రమా?

'ద్...ఆ...గ...ం...'

పెదిమలు అస్పష్టంగా కదిలాయి. నిజమే! సావిత్రి మాట్లాడుతోంది. సావిత్రి బతికేఉంది" సావిత్రి బతికే ఉంది' సావిత్రి...

వెయ్యి ఏనుగుల బలంతో తలుపులను నెట్టుకుంటూ సుడిగాలిలాగా లోపలికి దూసుకు పోయాడు రామచంద్రం.

వాసనలేదు! అసహ్యం లేదు! భయం లేదు! భ్రాంతి లేదు!

సావిత్రి బతికే ఉంది! అదే ఆలోచన! అదేశక్తి! అదే తపన!

"సా...వి...త్రీ...' గొల్లుమన్నాడు రామచంద్రం.

ఎంతో కాలం పాటు ఆమెను కటిక దరిద్రం పాలు చేసినందుకూ, ఎన్నో రకాల సమస్యల్లో ఇరికించి నందుకూ అతడి హృదయం లోతుల్లోంచి వచ్చిన ఆవేదన అతడి గొంతులో వ్యక్తమయింది.

ఆమె పెదిమలు కదిపింది. చప్పుడవుతోంది. కాని ఉచ్చారణ వెలువడలేదు. ఆమె పెదిమలు తెరచుకున్నాయి. నాలుక ఆ పెదిమల మధ్య వొణుకుతోంది.

'సా...వి...త్...రీ...!'

"బతుకుతానండి... చచ్చి.... పోనండీ... చావంటే.. భయంగా... ఉందండీ...." పెదిమలు అతికష్టం మీద అతి అక్షరం అక్షరం పలుకుతున్నాయి.

ఆమె తలను చేతుల్లోకి తీసుకున్నాడు రామచంద్రం.

"నువ్వు బతుకు సావిత్రీ! నువ్వు బతకాలి! నా కోసం... మన పిల్లల కోసం" రామచంద్రం ఏడుస్తున్నాడు. ఆమె చేతులు అందుకుని తన మీద వంచుకున్నాడు.

అతడి కన్నీళ్ళు వెచ్చగా ఉప్పగా ఆమె పెదిమల మీద పడ్డాయి.

"సోడా... కడుపులో నొప్పిగా ఉందండీ... సోడాతాగితే వాంతి అయి..." ఆమె మెలిదిరిగింది.

రామచంద్రం కొయ్యబారి పోయాడు. అవును. సావిత్రి కడుపులో పురుగుల మందు ఉంది. సోడా పట్టిస్తే అది కాస్తా వాంతి అవుతుంది. వాంతి అయితేనే గాని సావిత్రి బతకదు.

"బయటికి వెళ్ళి తీసుకువస్తాను సావిత్రీ! అంత వరకూ ఇక్కడే ఉంటావా"

"వూ!! బల్లకింద... శవం ఉంది కదండీ!"

"అవును.. సావిత్రీ! భయంగా ఉందా?"

ఆమె నిర్లిప్తంగా నవ్వి "రెండు గంటల నుండి ఇక్కడే కదా ఉన్నాము?" అంది. రామచంద్రంకి వెన్ను మరల జలదరించింది. ఆమెను ప్రేమగా తాకి బయటకు పరుగెత్తాడు.

'పిల్లలకు చెబితేనో....' అనుకున్నాడు.

'వద్దు! వాళ్ళు ఏడుచుకుంటారు!" అంది మనసు.

వెనకగేట్లోంచి బయటకు పరుగెత్తాడు రామచంద్రం.

అయితే మార్చ్యురీ కిటికీ వద్ద ప్రత్యక్షమైన నీడను అతడు ఆ తొందరలో చూడలేకపోయాడు.

ఆ నీడ కాంపౌండర్‌ది!

శవం మాట్లాడటం అతడు స్పష్టంగా విన్నాడు. కిటికీలోంచి భార్యాభర్తల స్పందన స్పష్టంగా చూశాడు.

ఈ పొరపాటు ఎలా జరిగింది?

పోలీసుల ఎదుట ఆమె బతికి లేదు. ఏం జరిగిందో ఏమో కాని ఆమె నాడి అందలేదు. తీరా ఆమె ఇప్పుడు బతికింది!

ఈ పొరపాటు ఎందువల్ల జరిగినా కేవలం అది తన వల్లనే జరిగింది!

అయితే పొరపాటును సరిదిద్దుకోవడం ఎలా!

సావిత్రిని చంపేయాలి.

రామచంద్రం సోడా తెచ్చేలోపుగా చంపెయ్యాలి!

కాంపౌండర్ ఆస్పత్రిలోకి పరుగెత్తాడు.

డాక్టర్ ఇప్పటికి రోగులతో లేడు.

కాంపౌండర్ అతడిని ఇహలోకానికి లాక్కువచ్చాడు.

"వాట్సెప్! ఇదంతా నువ్వే నా ప్రాణం మీదకి తెచ్చావు!" అరిచాడు డాక్టర్.

'అవుననుకోండి! దాన్ని కాస్తా ప్రక్కకు తప్పించగలం" అన్నాడు కాంపౌండర్.

"సరేలే.. ఎక్స్‌పైర్ అయిపోయిన ఇంజెక్షన్ ఏదయినా చేసెయ్! రియాక్షన్ త్వరగా వచ్చేస్తుంది!"

"నాకు చేతులు వొణుకుతున్నాయి సార్!"

డాక్టర్ నిరుత్సాహంగా నర్స్ వైపు చూశాడు.

డాక్టర్‌కి అందించాడు కాంపౌండర్. ఒక యాంపిల్, సిరంజి.

డాక్టర్ బయటికి పరుగెత్తాడు. వాకిట్లో ఇంకా సావిత్రి పిల్లలు ఏడుస్తూ ఉన్నారు. డాక్టర్ వాళ్ళను పట్టించుకోలేదు. వెనకప్రక్కకు పరుగెత్తాడు. మార్చ్యురీలో ప్రవేశించాడు.

సావిత్రి ఆశగా చూసింది.

రామచంద్రం కాదు! డాక్టర్! సూదిలోంచి మందు బొట్లు పడుతోంది.

నువ్వెలా బతికావే... నిన్ను చంపేస్తా..." డాక్టర్ వంగాడు.

సావిత్రి కళ్ళలో చావు భయం.

రెండు చేతులూ దగ్గరకు తెచ్చి అతడికి నమస్కారం పెట్టాలని ప్రయత్నించింది. చేతులు స్వాధీనపడలేదు. కనీసం గింజుకోవాలనీ, అతడు తన శరీరంలో ప్రవేశపెట్టబోయే విషాన్ని అడ్డుకోవాలనీ ప్రయత్నించాలనుకుంది.

ఆమె మనస్సు ఆమె శరీరానికి సహకరించడం లేదు. ఆమె బతుకుకు ఆమె సంసార జీవితం సహకరించనట్టే!

"అమ్మా?..."

"ఓలమ్మో...!"

డాక్టర్ చివ్వున వెనక్కి తిరిగాడు. గుమ్మంలో సావిత్రి పిల్లలు. తల్లి బతికే ఉన్న సంబరం, దగ్గరలో కిందపడి ఉన్న శవాన్ని చూసిన బీభత్సం వాళ్ళ అరుపుల్లో ప్రతిధ్వనించాయి.

డాక్టర్‌కి వొళ్ళు జలదరించింది. ఇంతసేపూ అతడికి సావిత్రి మాత్రమే కనిపించింది. ఇప్పుడు అదే సావిత్రి పిల్లల కోడిలాగా కూడా కనిపిస్తోంది. మరలా ముందుకు తిరిగి ఇంజెక్షన్ పొడవ బోయాడు.

ఎంతకాలం నుండో అణగదొక్కిన ఆవేదనా, తిరగబడాలనే ఆకాంక్షా ఒక్కసారిగా కెరటంలాగా విరుచుకు పడింది.

డాక్టర్ మెడ బలహీనమైన వ్రేళ్ళమధ్య ఇరుక్కుపోయింది.

శవానికి ప్రాణం వచ్చింది. పంచాయితీ జరగక ముందే అది విప్లవిస్తోంది. ఆ వ్రేళ్ళలో పిచ్చికోపం, తన బిడ్డలను బతికి ఉన్నంత కాలమూ సాకుకోవాలనుకునే తపనా, అన్యాయానికి తిరగబడాలనే ఆవేశమూ అతడి గొంతును నులిమేస్తున్నాయి.

సావిత్రి వగరుస్తోంది.

కడుపులో పురుగుల మందు తన ప్రతాపం ఇంకా చూపిస్తోంది.

డాక్టర్ కదలబోయాడు. కదిలేకొద్దీ ఆమె వ్రేళ్ళు గరుకుగా అతడి మెడలో గుచ్చుకోబోతున్నాయి. చెయ్యి విసిరి అందిన చోటయినా ఇంజెక్షన్ సూదిలో ఆమెను గుచ్చాలని ప్రయత్నిస్తున్నాడు.

ఆమె చీర మీద ఇంజెక్షన్ సూది దిగబడింది. అది శరీరంలోకి దిగబడి ఉంటే సిరంజి పిడిని ముందుకు నెట్టడం ఒక్కటే తరువాయి.

చావుకూ బ్రతుక్కూ మధ్య పోరాటం!

ఒకే ఒక్క బొటన వ్రేలి తాకిడి!

"అమ్మా! ఓలమ్మో!" డాక్టర్ వీపుమీద చిట్టి చేతులు పరామర్శిస్తోన్నాయి. అతడి కాళ్ళు పట్టి లాగుతున్నాయి.

ఒక్కసారిగా పిల్లలు ప్రక్కకు పడ్డారు. వీపు మీద పిడి గుద్దులు పడ్డాయి. మరుక్షణంలో ఒక బలమైన శక్తి వెనక్కి లాగినట్టయి డాక్టర్ గచ్చు నేలమీద వెల్లకితలా పడ్డాడు.

అప్పుడు చూశాడు.

రామచంద్రం! చేతిలో సోడాసీసాతో, పిచ్చెత్తినట్టున్న మొహంతో, చెమటలు కక్కే ఆగ్రహావేశాలతో పగకి ప్రతి రూపంలాగా, ప్రతీకారానికి తీర్చి దిద్దిన ప్రతిమలాగా ఉన్నాడు రామచంద్రం.

డాక్టర్ పడటం పడటం శవం మీద పడ్డాడు.

రామచంద్రం అతడిని ఈడ్చి తన్నాడు. సిరంజి ఎగిరి వెళ్ళి సరంబీకి కొట్టుకుంది. డాక్టర్ లేవ లేక పోతున్నాడు. వెన్నెముక కలుక్కుమంది.

రామచంద్రం భార్యకు 'బిస్లేరి' సోడా అందించాడు.

రామచంద్రం ఆమెను కళ్ళనిండుగా చూసుకుంటున్నాడు. వెలుగుకిరణం సోడాలో విరిగి సావిత్రి మొహం మీదకు ఒరిగింది.

(నిజాయితీకల వైద్య సిబ్బందికి—
క్షమాపణలతో)

